ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో

విషాదం

చిన్నారి మరణంతో రోధిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో మరణించిన చిన్నారి అహరున్(ఫైల్ ఫొటో))

- వైద్యచికిత్సలు అందక చిన్నారి మృతి
- ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆందోళన

అనంతపురం జిల్లా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. చికిత్స నిమిత్తం వచ్చిన నాలుగేళ్ల బాలుడు ఆసుపత్రిలోనే మరణించాడు. ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో వైద్య చికిత్సలు చేయకపోవడం వల్లనే తమ కుమారుడు మరణించాడంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వజ్రకరూరు మండలం చాబాలకు గ్రామానికి చెందిన రాజేష్, సరిత దంపతుల కుమారుడు అహరున్(5) గురువారం రాత్రి జ్వరంతో చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయానికి బాలుడు ఆసుపత్రిలోనే మరణించాడు. అక్కడి వైద్యులు సకాలంలో చికిత్సలు అందించకనే తమ కుమారుడు మరణించాడని తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు.

వార్త మెయిన్‌లో

అన్నదాతకు 'సుఖీభవ' కష్టాలు..!

- తెరుచుకోని గ్రీవెన్స్ మాడ్యుల్
- పడని వారు ఎక్కడకెళ్లి అడగాలో తెలియని అయోమయం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్నతదాత సుఖీభవ కష్టాలు తొలగడం లేదు. ఆగస్టు రెండవ తేది నుంచి రైతుల ఖాతాల్లో మొదటి విడత అన్నదాత సుఖీభవ డబ్బులు వేయడం ఆరంభించారు. అనంతపురం జిల్లాలో 2.74 లక్షల మందికి రూ.191.9 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు డబ్బులు పడని వారి సంఖ్య గణనీయంగా ఉండటం గమనార్హం. పడని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు సంబంధించిన గ్రీవెన్స్ మాడ్యూల్ క్లోజ్ అయ్యింది. దీంతో రాని వారు ఎవరికెళ్లి సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకెళ్తే సచివాలయంలోనే అంటున్నారు. సచివాలయానికి వెళ్తే వ్యవసాయ శాఖ కార్యాలయం అని చెబుతున్నారు. రెండు దగ్గర్లకెళ్లినా ఫలితం ఉండటం లేదు.

అనంతపురం జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 2.74 లక్షల మంది లబ్ధిదారులున్నట్టు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇందులో చాలా మందికి పడినప్పటికీ పడని వారు కూడా అదే మోతాదులోనున్నట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్ విధానంలో డబ్బులు పడే ఎన్‌పిసిఐ విధానంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ఈ రకంగా ఎన్‌పిసిఐలో మంజూరై డబ్బులు పడని లబ్ధిదారులు నాలుగు వేల మంది వరకున్నట్టు సమాచారం. ఇక 20,946 మంది జిఎస్‌డబ్ల్యు సర్వే పూర్తయ్యి, హౌస్ మ్యాపింగ్ ముగిసింది. అయినా డబ్బులు మాత్రం పడలేదు. వీరే కాకుండా వివిధ కారణాలతో ఇంకా డబ్బులు జమవని లబ్ధిదారులు లక్షకుపైగా ఉండటం గమనార్హం.

ఆగస్టు 20 నాటికే గ్రీవెన్స్ మాడ్యుల్ క్లోజ్

అన్నదాత సుఖీభవకు సంబంధించి ఆగస్టు 20వ తేది నాటికే గ్రీవెన్స్ మాడ్యుల్ క్లోజ్ అయింది. లబ్ధిదారులకు అన్నదాత మంజూరులో సమస్య వస్తే వాటిని సరిచేసేందుకు వీల్లేకుండా ఉంది. కార్యాలయాల వద్దకెళుతున్నా వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఓపెన్ చేస్తే అందులో లబ్ధిదారుల విజ్ఞాపనలను పెట్టి సరిచేయడానికి వీలుంటుంది. అది లేకపోవడంతో సమస్యలు ఎక్కడిక్కడే ఉంటున్నాయి. ఇటీవల జిల్లాలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఈ అంశం చర్చకు రావడం గమనార్హం.

అన్నదాత సుఖీభవ అందరికీ వర్తింపజేయాలి
చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

అన్నదాత సుఖీభవను రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత ఆగస్టు రెండవ తేదీన ఆరంభించింది. ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో జమవలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూసి సమస్యలున్న వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలి. లబ్ధిదారుల నుంచి ఆర్జీలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ ఓ. ఆనంద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సంబంధిత శాఖల అధికారులు ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 62వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలకు సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేయాలన్నారు. తిమ్మసముద్రం, ఊరిచింతల, కుడేరు ప్రాంతాలలో ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలను త్వరితగతిన అభివృద్ధి చేయాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. సింగిల్ విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. గత నెల ఆగష్టు నుంచి ఇప్పటి వరకు 1586 దరఖాస్తులు రాగా వాటిలో 1547కు ఆమోదం తెలిపారు. మిగిలిన 39కి వెంటనే ఆమోదించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల జెఎన్‌టియులో ప్రారంభమైన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో స్టార్టప్‌లకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, రవాణా శాఖ అధికారి వీర్రాజు, డిజెడ్ఎం దేవ కాంతమ్మ, ఎల్డీఎం నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్‌గా నరసింహకు బాధ్యతలు

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్‌గా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహకు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ బాలస్వామి ఉత్తర్వులు జాతి చేశారు. ఇప్పటి వరకు హెల్త్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించిన కార్యదర్శి రంగస్వామి బదిలీపై మైదుకూరుకు వెళ్లారు. దీంతో బిఎల్ నరసింహాకు బాధ్యతలు అప్పగించారు.

సిఆర్‌పిలకు శిక్షణ

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో ఉన్న చెత్త సంపద కేంద్రం వద్ద కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్ (సిఆర్‌పి)లకు చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్తపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తాడిపత్రి, పెద్దపప్పూరు, యల్లనూరు, శింగనమల, నార్పల మండలాల నుంచి సుమారు 70 మంది మహిళా సిఆర్‌పిలు శిక్షణకు హాజరై పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, రీసోర్స్‌పర్సన్లు గంగిరెడ్డి, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కలెక్టరేట్ : గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో శుక్రవారం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తాను అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిపి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో, జిల్లాల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ, నూతన టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించి సత్వరం ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని డిజిపికి అభినందలు తెలిపారు.

విద్యుత్ ప్రమాద బాధితునికి న్యాయం చేయాలి

రాప్తాడు : మండలంలోని హంపాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వతేదీన పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు ఎస్‌కె బైసి ప్రమాదవశాత్తు మరణిస్తే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించి ప్రమాదానికి కారణమైన విద్యుత్ శాఖ ఎఇపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం ట్రాన్స్‌కో ఎస్‌సి కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పోతలయ్య, పుష్పరాజు, భాస్కర్, అజయ్, మధు, పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిఐటియు జిల్లా మహాసభలు

రెండురోజుల పాటు అనంతలో నిర్వహణ
విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిత్యం ఉద్యోగ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న సిఐటియు అనంతపురం 11వ జిల్లా మహాసభలు అనంతపురం నగరంలో 27, 28వ తేదీల్లో జరగనున్నాయి. సాయి నగర్‌లోని ఆపిల్ గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు జరిగే మహాసభల శనివారం ప్రారంభం అవుతాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్‌లు శుక్రవారం తెలియజేశారు. మహాసభల ప్రారంభం సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ మైదానం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు సిఐటియు అఖిల భారత కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఉద్యోగ, కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, నిరుద్యో సమస్య, ఉద్యోగుల పిఆర్‌సి, డిఎ, సమాన పనికి సమాన వేతనం, వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, షెడ్యూల్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు అందరికీ కనీస వేతనాలు అమలు తదితర వాటిపై మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు. కార్మిక చట్టాల సవరణ, పని గంటల పెంపు రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఈ విధానాలపై భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో గడిచిన మూడు సంవత్సరాల కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకుని రాబోయే భవిష్యత్తు కార్యక్రమాలకు కార్యాచరణ తయారు చేస్తామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే మహాసభల్లో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జెఎన్‌టియులో ఫ్రెషర్స్ డే సందడి

ఆకట్టుకున్న విద్యార్థుల ఆట, పాటలు - ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి : వైస్‌ఛాన్సలర్

విద్యార్థినుల కృష్ణుడు గోపికమ్మల ప్రదర్శన

పాటలకు స్టెప్పులేస్తున్న విద్యార్థులు

ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఎన్టీఆర్ ఆడిటోరియంలో అన్ని విభాగాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే-2025ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఇందులో పాల్గొన్నారు. పాటలు, అదిరేటి స్టెప్పులతో ఆకంటుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 79 సంవత్సరాలు చరిత్ర కలిగిన జెఎన్‌టియు కళాశాల ఇందులో చదవడం ఒక వరంగా భావించి జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విసి పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాల మీద పరిశోధనలు చేస్తూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. సరికొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉద్యోగం కోసం కాకుండా, ఉద్యోగాలను సృష్టించే విధంగా విద్యార్థులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు సీనియర్లను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి వైపు నడవాలన్నారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా భవిష్యత్తు ఉన్నంతంగా ఉండేలా లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. డాక్టర్ మంజుల కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధరతో పాటు కళాశాల డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పామిడి

జిల్లా కేంద్రంలోని పాతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మావతిపై అనవసరంగా ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు కోరారు. శుక్రవారం నాడు పామిడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా॥శివ కార్తీక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామిడి ప్రభుత్వాసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అంజినప్ప కావాలనే పద్మావతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ తరచూ వేధిస్తున్నాడని చెప్పారు. పద్మావతిని మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న అంజినప్పపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాల్మీకి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాధర్, తెలుగుదేశం సీనియర్ నాయకులు జింకల సంజీవ కుమార్‌లు ఈ విషయంపై స్పంధించి విషయాన్ని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు నాయకులు వెంకట్‌నారాయణ, వి.రామిరెడ్డి

మాట్లాడుతున్న సిఐటియు నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం రుణాలు ఇచ్చి అనంతపురంలోని చిరు వ్యాపారులను ఆదుకోవాలని సిఐటియు నగర అధ్యక్షులు వెంకట్ నారాయణ, నగర ఉపాధ్యక్షులు రామిరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని 2వరోడ్డు బ్రిడ్జి కింద ఉన్న చిరు వ్యాపారులు శుక్రవారం సిఐటియులో చేరారు. ఈమేరకు సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి వారికి సిఐటియు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు వ్యాపారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వడ్డీతో రుణాలు, సబ్సిడీ రుణాలు అందజేసి ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఉపాధి లేక నగరానికి వలస వచ్చి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. అనంతపురం నగరంలో మున్సిపాలిటీ సుంకాలు అధికంగా వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల మేరకు సుంకాలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అధికంగా వసూలు చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చిన తర్వాత వ్యాపారులకు ఉపాధి పోతుందన్నారు. కావున ప్రజలు చిరు వ్యాపారుల దగ్గర కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, రైతు సంఘం జిల్లా నాయకులు కదిరప్ప, మరియమ్మ, తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నాయకులు వినోద్, శీన, రామాంజి, నాగభూషణం, సూరి, తిప్పేస్వామి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రెయినేజీ సమస్య తీర్చండి..

అసెంబ్లీలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే మరోసారి ప్రజావాణిని వినిపించారు. నగరంలో 50 డివిజన్లు, 4 పంచాయతీలు ఉన్నాయని, 5 లక్షల జనాభా దాటిందన్నారు. దీంతో డ్రెయినేజీ సమస్య కూడా పెరుగుతోందన్నారు. కావున శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ చాలా అవసరమన్నారు. 2024 ఎన్నికల ముందుకు హామీ ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. గతేడాది అక్టోబర్ 17న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు, డిసెంబర్ 30న ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డిపిఆర్ కూడా ఇచ్చినట్టు వివరించారు. కావున అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి ఆమోదం తెలిపి, పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

సతీష్‌రెడ్డిది ప్రమాదమే..: డీఎస్పీ

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

ప్రజాశక్తి-అనంతపురం

పామిడి మండలం జి.కొట్టాల గ్రామానికి చెందిన దేవన సతీష్‌రెడ్డి రోడ్డు ప్రమాదం జరగడంతోనే మృతిచెందాడని గుంతకల్లు ఇన్‌ఛార్జి డీఎస్పీ రవిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఘటనా స్థలంలోని సాక్ష్యాధారాలు, డాగ్ స్క్వాడ్ పరిశీలన, పోస్టుమార్టం నివేదిక, సిసిటీవి పుటేజీ పరిశీలన, ట్రాక్టర్ డ్రైవర్ నేరం ఒప్పుదల స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రమాదం జరగడం ద్వారానే సతీష్‌రెడ్డి మృతిచెందినట్లు తేలిందన్నారు. పామిడి నుంచి గుత్తి మండలం బ్రాహ్మణపల్లిలో దించేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో నేరస్థలం వద్ద రోడ్డు మధ్యలో ట్రాక్టర్‌లోని కొన్ని సామాన్లు కిందకు పడిపోగా ట్రాక్టర్‌ను ఆపినట్లు తెలిపారు. దీంతో మోటారు సైకిల్‌పై వెనుక నుంచి వచ్చిన వ్యక్తి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు. దీంతో బాధతో బాధితుడు అరుస్తుండగా తాను ట్రాక్టర్‌లో వెళ్లిపోయినట్లు తెలిపారు. అయితే సామాన్లను దించి తిరిగి అదేరోజు రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో వచ్చి ప్రమాద బాధితుడిని పరిశీలించగా చనిపోయి ఉండటాన్ని గమనించి ట్రాక్టర్‌ను తీసుకెళ్లి పామిడిలోని యజమాని రాజకుళ్లాయప్ప ఇంటి వద్ద వదిలివెళ్లిపోనట్లు డ్రైవర్ తెలిపాడని వివరించారు.

అవిశ్వాస తీర్మానానికి అనుమతివ్వండి

డిప్యూటీ సిఇఒను కలిసిన వైసిపి ఎంపిటిసిలు



జెడ్పీ సిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి ఎంపిటిసిలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల ఎంపిపి దాసరి సునీతపై అవిశ్వాస తీర్మానానికి అనుమతు ఇవ్వాలని మండలానికి చెందిన వైసిపి ఎంపిటిసిలు కోరారు. ఈమేరకు బుక్కరాయసముద్రానికి చెందిన 13 మంది వైసిపి ఎంపిటిసిలు ముందుగా జడ్పిటిసి భాస్కర్, వైసిపి మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డితో కలిసి శుక్రవారం అనంతపురంలోని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ స్వగృహంలో వైసిపి నాయకులు సమావేశమయ్యారు. అనంతరం జెడ్పీ డిప్యూటీ సిఇఒ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు డిప్యూటీ సిఇఒ స్పందిస్తూ ఎన్నికల నిబంధనలను పరిశీలించి కలెక్టర్ వారికి ఫైలు పంపుతామన్నారు. అనుమతి వచ్చిన తర్వాత వీటి వివరాలు మీకు తెలియజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, ఎంపిటిసిలు కాలువ వెంకటలక్ష్మి, రాంగోపాల్, వెంకట శివారెడ్డి, వీరనాగప్ప, ఎం.కుళ్లాయప్ప, నాగమ్మ, కె.రామచంద్ర, సుజాత, అంజన్నరెడ్డి, రాజేశ్వరి, సిరిజ, వైసిపి నాయకులు కాలవ శ్రీనివాసులు, ముసలన్న, పురుషోత్తం, లక్ష్మీనారాయణ, ముత్యాల రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసిన ఎపిజిఇఎ నేతలు

కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎపిజిఇఎ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఓ.ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సంఘం, ఆల్ మేవా సంఘం నేతలు శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లోని ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపీకృష్ణ, రామునాయక్, ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి హనుమంతు, సిటీ అధ్యక్షులు రఫీ, జిల్లా, సిటీ కార్యవర్గ సభ్యులు, ఆల్‌మేవా అధ్యక్ష కార్యదర్శులు షేక్షా, ఫక్రుద్దీన్, అన్వర్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో బాల,బాలికల సత్తా

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

ప్రజాశక్తి-అనంతపురం
ఈనెల 23 నుంచి 25వతేదీ వరకూ ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లాలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్-19 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా బాల, బాలికల జట్లు అత్యంత ప్రతిభ కనబరిచాయి. బాలికల జట్టు మొదటి స్థానం, బాలుర జట్టు తృతీయ స్థానాన్ని సాధించారు. గెలుపొందిన జిల్లా జట్టు క్రీడాకారులు, కోచ్, మేనేజర్ మారుతీప్రసాద్, జయప్ప,దాదా ఖలీందర్ మరియు సుషీలాను డివిఇఒ వెంకటరమణ నాయక్, కార్యదర్శి శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని అభినందనలు తెలిపారు. అలాగే బాలికల విభాగంలో వందన, పావని, లాస్య, అక్షిత, బాలుర విభాగంలో దినేష్, రామ్‌చరణ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

పామిడి : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాల సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎఎస్‌ఒ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతం పంపనూరు..!

ఆకట్టుకునేలా నగరవనం
నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

పంపనూరు వద్ద ఉన్న పార్కు

పంపనూరు పార్కులో ఏర్పాటు చేసిన నెమలి, జింకల బొమ్మలు

ప్రజాశక్తి-ఆత్మకూరు
"తిరిగే తుమ్మెదకే తేనె దొరుకుతుంది" అనే సామెత ఆధారంగా కొత్త ప్రదేశాల సందర్శన మానవుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తోంది. విహారం కొందరికి, వినోదం మరికొందరికి, విజ్ఞానం అందిస్తోంది. పర్యాటక ప్రాంతాల సందర్శన నిత్యంఏదో ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. 1970 సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ప్రపంచ పర్యాటక సంస్థను ఆమోదించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవంను జరుపుకుంటున్నాం. ఈ ఏడాది పర్యాటక సంస్థ పర్యాటకం, శాంతి అనే నినాదంతో ముందుకు వచ్చింది.

పర్యాటక ప్రాంతంగా పంపనూరు

పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్రంలో అనంతపురం జిల్లా 11 వ స్థానం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అందులో పంపనూరు ఒకటి. అనంతపురం నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామం రెడ్ కరంగం ఖాతాలో చోటు సంపాదించుకుంది. పడమటి యాలేరు పంచాయతీ వై.కొత్తపల్లి గ్రామ సమీపంలోని నల్లమల అటవీ కొండలపై శ్రీ మలోబులేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వెలిసింది. ఈ ప్రాంతంలో నల్లమల కొండల చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో జంతు పక్ష్యాధులు సంరక్షిస్తూ ఉంటాయి. ఇక పంపనూరు గ్రామంలో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పునర్ధరణతో పంపనూరు గ్రామానికి మరింత విశేషణ ఆదరణ లభించింది.

ఆకట్టుకుంటున్న నగరవనం

అటవీశాఖ అధికారులు అనంతపురం మధ్య ప్రధాన రహదారిలో నగర వనం పేరుతో పార్కును ఏర్పాటు చేశారు. పంపనూరు గ్రామానికి జిల్లా నలుమూలల నుంచి గాక, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఇదే సమయంలో నగరవనం పార్క్‌ను సందర్శిస్తుంటారు. ఈ పార్కులో చిన్నారుల కోసం సైక్లింగ్, రోలింగ్ మిషన్, జారే బండ, చైర్ జంప్, లాంటి పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు ఆవరణంలో నెమలి, జింకలు లాంటి జంతువులు ఉన్నాయి. పర్యాటకుల కోసం అటవీ శాఖ ప్రత్యేకంగా ఓపెన్ హౌస్ లాంటి నీడనిచ్చే ప్రత్యేక గృహ సముదాయాలు, తాగునీటి వసతులు కల్పించింది. మంగళ, ఆదివారాల్లో ఈ పార్కులో జనసందడి ఏక్కువగా ఉంటుంది. ప్రతి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పార్కు ప్రజల సౌకర్యార్థం తెరిచి ఉంటుంది.

బాలకృష్ణపై వైసిపి నేతల ఫైర్

అనంతపురం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అసెంబ్లీ వేదికగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వైసిపి యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాలకృష్ణకు మంచి బుద్ధి ప్రసాదించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు అభినందన

అనంతపురం : ఢిల్లీలో జరిగిన 8వ అఖిల భారత థాల్ సైనిక్ క్యాంపులో రజత పతకాలు సాధించిన నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు కృష్ణ, కిరణ్, నానివాధన్‌ను శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం వడియంపేటలో ఉన్న తైక్వాండో శిక్షణ కేంద్రంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంధ డైరెక్టర్ భవానీ రవికుమార్, ది బోర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సిఇఒ ఎంఎల్ఎస్ దేవకుమార్, రోటరీ క్లబ్ అనంతపురం సెంట్రల్ అధ్యక్షులు గల్లా హర్ష, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శాంతరాజ్, రోటరీ క్లబ్ అనంతపురం సెంట్రల్ సభ్యులు సూర్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ మురళి, పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్కర్లకు వైద్యపరీక్షలు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలోని ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఆసుపత్రి సూపరిటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ, మున్సిపల్ వార్డు సభ్యులు శారద, కోఆప్షన్ సభ్యులు నజీర్ అహ్మద్, వైద్యులు, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపిడిఒను కలిసిన టిడిపి నాయకులు

గుమ్మగట్ట : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ వి.జయరాములును టిడిపి నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఎంపిడిఒను కలిసిన వారిలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, మండల కన్వీనర్ గిరిమలప్ప, సర్పంకు నాగరాజు, విజయలక్ష్మి, బేలోడు సంజీవ, పైదొడ్డి రాజు, బిటిపి రాజు, ముత్తయ్య, డీలర్ సత్తి, వన్నూరుస్వామి, కుమార్‌రెడ్డి, చంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

పామిడి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని ఎద్దులపల్లి ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఉదయ్‌కుమార్, సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త రామాంజినమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, చిరు ధాన్యాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. తొలుత ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతోపాటు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యకళ, ఎఎన్ఎం మార్తమ్మ, ఎంఎల్‌టి శ్వేత, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కార్యకర్తకు నివాళి

బ్రహ్మసముద్రం : అనారోగ్యంతో మృతిచెందిన మండలం పరిధిలోని వేపలపర్తి గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త సుమలత (27)కు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేనల్లుడు దేవినేని ధర్మతేజ, టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, తదితరులు సుమలత భౌతికకాయానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిపి మంజుల వన్నూరుస్వామి, మాజీ సర్పంచు హనుమంతప్ప, మండల కార్యదర్శి బీమప్ప, డీలర్ పెన్నప్ప నాయకులు కత్తాలి చంద్ర, శివలింగ, బ్యాంకు క్యాషియర్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందికి చీరలు పంపిణీ

పామిడి : దసరా పండుగ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న మహిళా సిబ్బందికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చిలకల రాజగోపాల్ శుక్రవారం చీరలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, తనయుడు, పామిడి గుత్తి ఇన్‌ఛారి గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు సద్దల రామాంజనేయులు, సద్దల గోవర్ధన్ సహాయ, సహకారాలతో చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి, కొత్తపల్లి సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కత్రిమల ప్రభాకరచౌదరి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 11వవార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కేంద్రంలోని పిల్లల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మితో అన్నారు. పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇఇ గోవిందప్ప, హరికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పిల్లలపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఉమాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు, సమయపాలన, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా పి.4 సర్వేను త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

మహిళలు కుటుంబానికి బలమైన ఆధారం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి-రాయదుర్గం
మహిళలు కుటుంబానికి మూలస్తంభమని, అలాంటి వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సక్రమంగా నడుస్తుందని రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలోని కోటవీధిలో ఉన్న మారెమ్మ గుడి వద్ద మహిళలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తప్పనిసరిగా ఆహార నియమాల్లో ఉదయం అల్పాహారం తప్పనిసరిగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పాల ఉత్పత్తులు, ప్రోటీన్ ఉన్న ఆహారం పప్పులు, గుడ్లు, చేపలు, శనగలు, కూరగాయలు, పండ్లు రోజూ ఆహారంలో తీసుకోవాలన్నారు. ఇనుము కలిగిన ఆహారం పాలకూర, గోంగూర, రాగి, మాంసం తీసుకోవాలన్నారు. కాల్షియం కోసం సజ్జ, రాగి, నువ్వులు ఉపయోగించాలని కోరారు. రోజుకు 2-3 లీటర్ల నీరు తాగాలని, తీపి, నూనె, ఫాస్ట్ ఫుడ్ ఆహారాన్ని తగ్గించాలని కోరారు. ఇకపోతే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎర్రిస్వామి, సూర్య, ఆరోగ్య కార్యదర్శులు అరుణ, శైలజ, జయమ్మ, ఆశా కార్యకర్తలు సుబ్బలక్ష్మి , సునీత, మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

డిపిఒ కార్యాలయం ఎదుట సిఐటియు ధర్నా


ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
రుద్రంపేట గ్రామ పంచాయతీలో తొలగించిన గ్రామపంచాయతీ కార్మికుడు వెంకటరాముడిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నగరంలోని డిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులపై అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. డిపిఒను బెదిరించిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయని గుర్తు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెప్పిన మాట వినకపోతే అక్రమంగా తొలగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కార్మికుడిని పనిలోకి తీసుకోవాలని చెప్పినా తీసుకోలేదన్నారు. డిపిఒ తక్షణమే జోక్యం చేసుకొని కార్మికుడిని పనిలోకి పెట్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒ నాగరాజునాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు బాషా, చంద్ర, మూర్తి, భూషణ, లక్ష్మీనారాయణ,

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్
ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు సంబంధించి విదేశాల నుంచి వచ్చే నిధులను పునరుద్ధరించేందుకు ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయాలని మండల పరిధిలోని బోరంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచు శోభారాణి కోరారు. ఈమేరకు ఇందుకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మాన కాపీని ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలకుపైగా ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సేవా కార్యక్రమాలు కాకుండా క్రీడా రంగం, వైద్య, విద్య, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల భవనాల నిర్మాణాలు, ఉత్పత్తి చేసే వస్తువులకు మార్కెటింగ్, పేద రైతులకు పండ్లతోటలు, డ్రిప్ ఇరిగేషన్ ప్రోత్సాహంతో పాటు అనేక నైపుణ్యాల కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి వైపు చర్యలు తీసుకుందన్నారు. ఇలాంటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఆర్డీటీని కాపాడుకోవాలని కోరారు.

కలెక్టర్ ఓ.ఆనంద్‌ను సన్మానిస్తున పల్లె కిశోర్, పివికెకె సిబ్బంది

కష్టం కాదు..లక్ష్యాలను చేరుకోవడమే ముఖ్యం

'పివికెకె' ఫ్రెషర్స్ డే వేడుకల్లో కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం
'మనం ఏ కోర్సు చదివా.. ఎంత కష్టపడ్డాం అన్న కాదు.. అనుకున్న లక్ష్యాలను చేరుకున్నామా..లేదా అన్నదే ముఖ్యం' అని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. శుక్రవారం అనంతపురంలోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం కేవలం చదువు, పరీక్షలు మాత్రమే కాకుండా మిత్రులు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ వంటి వాటిల్లో పాల్గొనాలన్నారు. అంతేగాకుండా మనం ఏ కోర్సు చదివాం, ఏ సబ్జెక్ట్ ఎంచుకున్నాం అన్నదాని కన్నా, మనం ఎంత కష్టపడ్డాం, ఎలాంటి లక్ష్యాలను చేరుకున్నాం, సమాజానికి ఎలాంటి సేవ చేశామనేవి చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కిషోర్ పల్లె, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డానా, ఎఇ మనోహర్‌రెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, శ్రీ బాలాజీ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్లకు అహుడా అనుమతి తప్పనిసరి

ఛైర్మన్ టిసి వరుణ్, వైస్‌ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్
అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోని లే అవుట్లకు తప్పనిసరిగా అహుడా అనుమతి తీసుకోవాలని ఛైర్మన్ టిసి వరుణ్, వైస్‌ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. స్థానిక అహుడా కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు అహుడా అనుమతి లేని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలన్నారు. అనుమతి లేని లేఅవుట్లు రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు అక్టోబర్ 23వ తేదీ చివరి తేదీ అని, ఆలోపు రెగ్యులరైజేషన్ చేసుకోవాలన్నారు. ఎంఐజి లేఔట్లలో పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులని ఆదేశించారు. ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని అహుడా కార్యాలయంలో లేఅవుట్ అనుమతులు, బిల్డింగ్ అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఎంఐజి సమస్యలపై అర్జీలు అందజేయవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు.

కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకోవడం తగదు

రాయదుర్గం : ఎపిపిసిసి అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన రైతన్నకు తోడుగా కాంగ్రెస్' ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం తగదని ఆ పార్టీ రాయదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో రైతన్నల ఆక్రందన కూటమి ప్రభుత్వానికి పట్టలేదన్నారు. రైతు సంక్షేమమే అజెండా అని, అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ప్రతి రైతు కళ్లల్లో ఆనందమే లక్ష్యం అంటూ కూటమి నాయకులు చెబుతున్నవన్నీ బూటకమే అని అన్నారు. ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధరకు దిక్కులేకుండా పోయిందన్నారు. మరోవైపు సరిపడ ఎరువులు లేవన్నారు. ఈ సమయంలో రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్నకు తోడుగా కాంగ్రెస్' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ర్యాలీ నిర్వహించాలనుకుంటే అడ్డగించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడా సామగ్రి వితరణ


క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం
నగరంలోని గార్లదిన్నెలో రోడ్డులో కెఎస్ఆర్ అర్బన్ సిటీలో ఉన్న తైక్వాండో శిక్షణ కేంద్రంలో తైక్వాండో క్రీడాకారులకు రోటరీ క్లబ్ వారు శుక్రవారం యూనిఫాం, షూతోపాటు క్రీడా సామగ్రిని విరాళంగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంధ డైరెక్టర్ భవానీ రవికుమార్, నాయకులు గల్లా హర్ష, ది బోర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సిఇఒ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శాంతరాజ్, రోటరీ క్లబ్ అనంతపురం సెంట్రల్ సభ్యులు సూర్యనారాయణ, పాండురంగయ్య, న్యాయవాదులు మల్లారెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వైఖరితోనే 11సీట్లు

అనంతపురం కలెక్టరేట్ : గత ఐదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుసరించిన వ్యక్తిత్వం, వైఖరితోనే రాష్ట్ర ప్రజలు 11 సీట్లకు కుదించారని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ విమర్శించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ గురించి ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఆయన సొంత సోదరి షర్మిల విమర్శించింది వైసిపి నేతలు మరిచిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్తగా ఏమి మాట్లాడింది ఏమీ లేదని ఉన్నదే మాట్లాడారని తెలిపారు. లేనిపోని విమర్శలు వైసిపి నాయకులు మానుకోవాలని హితవు పలికారు.

జీఎస్టీ-2.0తో ఊరట

కళ్యాణదుర్గం టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న జీఎస్టీ-2.0తో పన్నుల భారం తగ్గి ఊరట లభిస్తోందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివశంకర్, ఇఒఆర్‌డి రంగనాయకులు, జీఎస్టీ అధికారులు వెంకటేశులు, బాలాజీ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండల పరిధిలోని గరుడాపురం గ్రామంలో జీఎస్టీ-2.0తో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గతంలో నాలుగు స్లాపుల విధానంతో జీఎస్టీ భారం ఉండేదని ప్రస్తుతం వాటిని తొలగిస్తూ మూడు స్లాబుల విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్, రవి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : జిల్లాస్థాయి స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో శ్రీ మాస్టర్ మైండ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ గౌసియాభాను తెలిపారు. అనంత ఈశ్వర అసోసియేషన్ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మాస్టర్ మైండ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జెర్రీ పునీత్, జెర్రీ లోహిత్ అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈమేరకు ఆయా విద్యార్థులతోపాటు కోచ్ రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం పట్టివేత


మద్యం వివరాలను వెల్లడిస్తున్న సిఐ సోమశేఖర్

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని ఐదుకల్లు రోడ్డులో రవాణా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ శంకర్‌నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన బోయ గోపాల్ 288 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేసినా, విక్రయిచినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నార్పలలో మహిళా దొంగల హల్‌చల్

నార్పల : మండల కేంద్రంలో ముగ్గురు మహిళా దొంగలు శుక్రవారం హల్‌చల్ చేశారు. చోరీకి పాల్పడిన ముగ్గురు మహిళా దొంగలు స్థానికులు గుర్తించారు. దీంతో పట్టుకోబోయిన స్థానికులకు ఓ మహిళ దొరికింది. మిగిలిన ఇద్దరు పారిపోతుండగా వెంబడించి మరో మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఒక మహిళ పారిపోయింది. అనంతరం దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దొంగలు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎక్కడెక్కడ, ఎన్ని చోరీలకు పాల్పడ్డారనే విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. నిందితుల్లో ఓ మహిళ ఒంగోలు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ ఉపాధి, యాచన కోసం చాలామంది నార్పలకు వస్తుంటారని, అపరిచిత వ్యక్తులపై స్థానికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆటోడ్రైవర్‌కు పాముకాటు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన ఓ ఆటోడ్రైవర్‌కు గురువారం అర్ధరాత్రి పాముకాటు వేసింది. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మల్లికార్జున మూత్ర విసర్జన కోసం ఇంటి నుంచి బయటికి వెళ్తుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.A.No:16/2025 in E.P.No:27/2024 in O.S.No:245/2015
Between:
1)A.రామాంజలు రెడ్డి Died by LRs
2) A.విజయకుమారి W/o లేట్ A. రామాంజలు రెడ్డి
3) A.అనిల్‌కుమార్ రెడ్డి S/o లేట్ A. రామాంజలు రెడ్డి
R/o.D.No.2/1035-11-1, జయనగర్ కాలనీ, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా ...అర్జీదారులు/LRs of D.Hr
ఎదిరి
P.ఉమా మహేశ్వరి నాయుడు ...రెస్పాండెంట్/జె.డిర్
To, (రెస్పాండెంట్/జె.డి.ఆర్)
P.ఉమా మహేశ్వరి నాయుడు S/o P.శివశంకర నాయుడు Now R/o.D.No.1/613-4-5-6, సిపిఐ కాలనీ, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.
రెస్పాండెంట్/జె.డిర్‌కు నోటీసులు
U/Sec.146 OF C.P.C.R/W.R.28 OF C.R.P ప్రకారము
పై అర్జీలో అర్జీదారులు చనిపోయిన ఎ.రామాంజలు రెడ్డి యొక్క వారసులుగా తమను చేర్చమని పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసియున్నారు. సదరు అర్జీని కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 29-10-2025వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినము మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షములో కోర్టువారు తీర్మానము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
సి.రమేష్‌నాథ్ రెడ్డి & వై.హనీఫ్ బాష
అడ్వకేట్లు, తాడిపత్రి &
జెడ్.సతీష్,
అడ్వకేట్, గుత్తి

చాకలి ఐలమ్మకు నివాళి

ప్రజాశక్తి-శింగనమల
తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య మాట్లాడుతూ 'ఈ భూమినాది.. పండించిన పంట నాది.. తీసుకెళ్లడానికి దొరెవ్వడు.. నా ప్రాణం పోయాకే పంట, భూమి దక్కించుకోగలరు' మాటల్ని తూటాలుగా మల్చి దొరల గుండెల్లో అగ్నిలా రగిలిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తి దారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్, బి.రమణయ్య, నాయకులు అలిపిర కృష్ణుడు, సి.నాగప్ప, రఘు, గోవిందరాజులు, టిసి భూషణ, నాగరాజు, చిన్న నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, నరసింహులు, మారుతి, వీర నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి

పిజిఆర్ఎస్ సమస్యలపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కాంర చూపాలని కమిషనర్ బాలస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక కౌన్సిల్‌హాల్లో అన్ని విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించే అర్జీలు వచ్చే సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. హడావిడిగా అర్జీలు పరిష్కరించామంటే పరిష్కరించామన్నట్లుగా కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు సంబంధిత సమస్య పరిష్కారంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఇబ్బందులు ఉంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ వేదికకు వచ్చే ప్రతి సమస్య అర్జీ విలువైనదిగా గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

ఈ పంట నమోదు చేయించుకోండి

ఆత్మకూరు : పంటలు సాగు చేసిన రైతులు సాగు పంటను తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) జిఎం అల్తాఫ్ సూచించారు. శుక్రవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. తర్వాత ఈ పంటనమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ఎస్‌కె సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.విజయ జ్యోతికుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

28న గుర్రం జాషువా జయంతి

అనంతపురం : కవికోకిల గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఆదివారం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగే ఉపన్యాసాలను జయప్రదం చేయాలని ఫౌండేషన్ సభ్యులు లోకన్న, కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉపన్యాసాలతోపాటు జాషువా పద్యాలను గానం చేయనున్నట్లు తెలిపారు. కావున సాహిత్య, భాషాభిమానులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.